సాక్షి తిరుపతి

ఆదివారం । 27 । జూలై । 2025



ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం

నాయుడుపేట పట్టణంలో రెండు రోజుల పాటు జరిగే అంతర్ జిల్లా ఫుట్‌బాల్ టోర్నీ శనివారం ప్రారంభమైంది. - 8లో



'పంచగవ్య' శ్రేయస్కరం

పంచగవ్య ఉత్పత్తులతో మానవాళి మనుగడకు శ్రేయస్కరమని ఐసీఎస్ఎస్ఆర్ నిపుణులు అన్నారు. - 8లో



చిరుతలు రాకుండా చర్యలు

శేషాచల అటవీ ప్రాంతం నుంచి చిరుతలు జనావాసాల్లోకి రాకుండా చర్యలు చేపడుతున్నామని సబ్ డీఎఫ్‌వో తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు బిల్లుల చెల్లింపునకు అవకాశం

చిత్తూరు కార్పొరేషన్ : ఆదివారం ప్రభుత్వ సెలవురోజు అయినప్పటికీ తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో విద్యుత్ బిల్లులు కట్టవచ్చని అధికారులు తెలిపారు. రెండు జిల్లాల్లోని అన్ని విద్యుత్ బిల్లుల కేంద్రాలు పనిచేస్తాయని చిత్తూరు, తిరుపతి జిల్లాల ట్రాన్స్‌కో ఎస్ఈలు ఇస్మాయిల్ అహ్మద్, సురేంద్రనాయుడు తెలిపారు. వినియోగదారులు ఈ మార్పును గమనించాలని కోరారు. ముఖ్యంగా హెచ్‌టీ సర్వీసుదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.


శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 12 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 73,576 మంది స్వామి వారిని దర్శించుకోగా 25,227 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.23 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్‌లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

ప్రసూతి ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

తిరుపతి తుడా : స్థానిక ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్సను వైద్యులు విజయవంతంగా చేశారు. వివరాలు ఇలా.. నెల్లూరుకు చెందిన వనిత (46) గర్భం ముఖద్వారం నందు 12-8 సి.ఎం పరిమాణం గల పెద్ద సైజు కణితి ఏర్పడింది. అరుదైన కణితిని ఆసుపత్రి వైద్యులు పలు పరీక్షలు నిర్వహించి చాకచక్యంగా తొలగించారు. వైద్య బృందాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రమీల అభినందించారు.

29న రాయలసీమ డిపో మేనేజర్ల సదస్సు



జగదీష్, జిల్లా ప్రజా రవాణా అధికారి

తిరుపతి అర్బన్ : ఈనెల 29న తిరుపతిలోని భారతీ విద్యా మందిరంలో నిర్వహిస్తున్న రాయలసీమ ఆర్టీసీ డీఎంల సదస్సుకు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు హాజరు కానున్నారని జిల్లా ప్రజా రవాణా అధికారి జగదీష్ తెలిపారు. రాయలసీమ జిల్లాల్లోని ఆర్టీసీ జోన్-4 పరిధిలోని 54 డిపోలకు చెందిన డీఎంలకు శనివారం సమాచారం అందించారు. జోన్-4 పరిధిలోని రాయలసీమ జిల్లాలకు చెందిన డిపో మేనేజర్లతో ఎండీ సమీక్షిస్తారని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సుకు సంబంధించి పూర్తి వివరాలను వెల్లడించనున్నారని వివరించారు. 28న ఎండీ తిరుపతి జిల్లాలోని వాకాడు డిపోను పరిశీలన చేస్తారని, ఆ తర్వాత తిరుపతికి చేరుకుంటారన్నారు. అనంతరం 29న సదస్సులో పాల్గొంటారని తెలిపారు.

వసతి వేదన

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

ప్రభుత్వ వసతిగృహాల్లో పిల్లలు కటిక నేలపైనే నిద్ర.. నాణ్యమైన భోజనం కరువు.. తాగేందుకు శుద్ధజలం లేదు.. మరుగుదొడ్ల దుర్గంధం వెదజల్లుతున్నాయి..ఆరుబయటే స్నానాలు ఇలా..విద్యార్థులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. వసతిగృహాల్లో సమస్య లు రాజ్యమేలుతున్నా కూటమి ప్రభుత్వం మొద్దు నిద్ర వీడడం లేదు. పేద విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో సంక్షేమ వసతి గృహాలను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుత కూటమి పాలకుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు కారాగారాలను తలపిస్తున్నాయి.



తిరుపతి : ఇంటి నుంచి తెచ్చుకున్న చాపలపై నిద్రిస్తున్న విద్యార్థులు



తిరుపతి : అన్నం పాత్రను దించుతున్న విద్యార్థినులు

సంక్షామం

- పేద విద్యార్థులపై ప్రభుత్వం చిన్నచూపు
- దారుణమైన దుస్థితిలో సంక్షేమ వసతి గృహాలు
- హాస్టళ్లలో అసంపూర్తిగా అభివృద్ధి పనులు
- శిథిలావస్థలో పలు వసతి గృహాలు
- అద్దె భవనాల్లో సమస్యల దరువు



తిరుపతి : చెన్నారెడ్డి కాలనీలోని ఎస్సీ బాలికల-1 హాస్టల్‌లో పాచిపట్టిన గోడలు ఇలా..

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, కేజీబీవీ, గురుకుల వసతి గృహాల్లో సంక్షేమమే కనిపించడం లేదు. శిథిల భవనాలు ఒక వైపు...మరోవైపు అద్దె భవనాలు.. ఉన్న భవనాల్లో వసతుల కొరత ఇలా ఏదో ఒక సమస్య వసతి గృహాల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. వర్షం కురిసే గదులు, తలుపులు లేని మరుగుదొడ్లు, నీరు లేని స్నానాల గదులు ఒక్కటేమిటి సవాలక్ష సమస్యలు వసతి గృహాల్లో తిష్ట వేశాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంక్షేమ వసతి గృహాల బాగోగులను విస్మరించింది. పాఠశాలలు పునఃప్రారంభమై రెండు నెలలు కావొస్తున్నా ఇప్పటి వరకు హాజరు శాతం నామ మాత్రంగానే ఉంది. సరైన వసతులు లేకపోవడంతో తల్లిదండ్రులకు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలపై నమ్మకం పోయింది. పేద విద్యార్థుల ఉన్నతికి ఏర్పాటు చేసిన సంక్షేమ వసతి గృహాలు కారాగారాలను తలపిస్తున్నాయి. వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలపై ఇటీవల రాష్ట్ర హైకోర్టు సీరియస్ అయ్యింది. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, కేజీబీవీ, గురుకుల వసతి గృహాలను రెండు రోజుల పాటు సాక్షి విజిట్ చేసింది. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ ప్రీ మెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ బాల, బాలికల వసతి గృహాలు 62, బీసీ ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ బాల, బాలికల వసతి గృహాలు 64 గృహాల్లో ఉన్న అసౌకర్యాలను సాక్షి విజిట్‌లో క్లిక్ మనిపించింది.



తిరుపతి : చెన్నారెడ్డి కాలనీలోని ఎస్సీ బాలికల-2లో ఆగిపోయిన మరమ్మతు పనులు

మరుగుదొడ్ల సమస్య

జిల్లాలోని వసతి గృహాల్లో మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా వేధిస్తోంది. విద్యార్థులకు తగిన మరుగుదొడ్లు లేకపోవడం, ఉన్న మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడం, నీరు రాకపోవడం వంటి సమస్యలున్నాయి. మరుగుదొడ్లను శుభ్రం చేసే వారు లేకపోవడంతో విద్యార్థులే శుభ్రం చేసుకుంటున్నారు. అదే విధంగా శుభ్రం చేసుకునేందుకు ఫినాయిల్ సైతం లేకపోవడంతో చాలా వసతి గృహాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. వసతి గృహాల్లోని పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండటంతో విద్యార్థులకు జ్వరాలు వ్యాపిస్తున్నాయి.



చంద్రగిరి : ఎస్సీ హాస్టల్‌లో మరుగుదొడ్ల దుస్థితి

నాసిరకంగా భోజనం



వాకాడు : నేలపైనే భోజనం చేస్తున్న విద్యార్థులు

వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాల్సి ఉంటుంది. ఇందుకు ప్రత్యేక నిధులను సైతం మంజూరు చేస్తున్నారు. మెనూ ప్రకారం పలు వసతి గృహాల్లో విద్యార్థులకు భోజనం పెట్టడం లేదు. నీళ్ల సాంబారు, చప్పిడి అన్నం , రుచి లేని రసం పెడుతున్నారు. దీంతో చాలా మంది విద్యార్థులు ఆ భోజనాన్ని తినలేక పస్తులుంటున్నారు. కొంత మంది వార్డెన్లు కమీషన్‌లకు కక్కుర్తిపడి కాంట్రాక్టర్‌లతో కుమ్మక్కయ్యారు. ప్రతి నెలా కాంట్రాక్టర్‌లు కొంత మొత్తం ముడుపులను వార్డెన్‌లకు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

దోమల మోత

జిల్లాలోని దాదాపు అన్ని వసతి గృహాల్లో దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారు. ప్రస్తుతం సీజన్ మారడంతో దోమల బెడద రోజు రోజుకూ తీవ్రతరం అవుతోంది. కనీసం కిటికీలు, తలుపులకు నెట్ ను ఏర్పాటు చేయలేకపోతున్నారు. దీంతో దోమల మోత అధికమై విద్యార్థులకు కంటిమీద కునుకు కరువైంది.



తిరుపతి : ఎస్సీ హాస్టల్‌లో కిటికీలు ఇలా..

అందని బెడ్‌షీట్లు

జిల్లాలోని ఎస్సీ, బీసీ వసతి గృహాల విద్యార్థులకు ప్రస్తుత ఏడాదిలో బెడ్‌షీట్‌లు, బ్లాంకెట్స్ సరఫరా చేయని దుస్థితి. దీంతో విద్యార్థులు ఇళ్ల నుంచి చాపలను తెచ్చుకుని నిద్రిస్తున్నారు. అవి కూడా తెచ్చుకోలేని విద్యార్థులు చల్లటి నేలపైనే నిద్రపోతున్నారు.

సబ్బులు, నూనె కరువు

వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు రెండు నెలలుగా కాస్మొటిక్ చార్జీలు ఇవ్వడం లేదు. కూటమి ప్రభుత్వం అలసత్వం వహిస్తోంది.

ఆరోగ్య పరీక్షలేవీ?

నిబంధనల మేరకు ప్రతి నెలా ప్రభుత్వ వైద్యులు సమీప వసతి గృహాలకు వెళ్లి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి. అయితే చాలా వసతి గృహాల విద్యార్థులకు వైద్యులు వస్తారనే సమాచారం కూడా తెలియదు.

భద్రత కరువు

జిల్లాలోని ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాల్లో సరిపడా సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ కరువైంది. వాచ్‌మెన్‌లు ఏర్పాటు చేయకపోవడంతో బాలికలు అభద్రతా భావంతో ఉన్నారు.

కాంట్రాక్టులు కొట్టేసిన పచ్చనేతలు

వసతి గృహాల్లో మైనర్ రిపేర్ల టెండర్‌లను పచ్చనేతలు కొట్టేశారు. పనులు చేపట్టడంలో అలసత్వం వహిస్తున్నారు. ఫలితంగా వసతి గృహాల్లోని సమస్యలు అసంపూర్తిగా ఉన్నాయి.

జిల్లాలోని వసతి గృహాల వివరాలు

ఎస్సీ వసతి గృహాలు	62
ఎస్టీ వసతి గృహాలు	07
ఏపీఎస్‌డబ్ల్యూఆర్ గురుకులాలు	11
బీసీ వసతి గృహాలు	64
ట్రైబల్ గురుకులాలు	06
మహాత్మా గాంధీ పూలే గురుకులాలు	07
ఏపీ రెసిడెన్షియల్ గురుకులాలు	03
బీసీ వసతి గృహాల్లోని విద్యార్థులు	1,987
ఎస్సీ వసతి గృహాల్లోని విద్యార్థులు	3,007



తిరుపతి : ఎస్సీ బాలికల-1లో వడ్డిస్తున్న విద్యార్థిని

సమస్యలు ఇలా...


- తిరుపతి నగరంలోని చెన్నారెడ్డికాలనీలో ఉన్న ఎస్సీ బాలికల -1 వసతి గృహంలో భోజనం సరైన సమయానికి పెట్టడం లేదు. బుధవారం రాత్రి కోడిగుడ్లు, అరటి పండ్లను విజిట్‌కు వెళ్లిన తర్వాత పెట్టారు. మరోవైపు సరైన వసతులు లేక బాలికలు నేలపైనే నిద్రిస్తున్నారు. వసతి గృహంలో పనిచేయాల్సిన సిబ్బంది అందుబాటులో ఉండకపోవడంతో పిల్లలే భోజనం వడ్డించుకునే పరిస్థితులు దాపురించాయి.
- తిరుపతి నగరంలోని ఎస్సీ బాలికల-2 వసతి గృహంలో సరైన వసతులు లేవు. పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. అలాగే చెన్నారెడ్డి కాలనీలోని బీసీ బాలికల వసతి గృహంలో భోజనం గది చిన్నదిగా ఉండటంతో విద్యార్థులు రెండోసారి భోజనం పెట్టకుండా వెళ్లిపోయారు. అదే ప్రాంతంలోని సమీకృత ఎస్సీ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకున్న సొంత దుప్పట్లను కప్పుకుంటున్నారు.
- బీఎన్ కండ్రిగ ఎస్సీ బాలుర వసతి గృహంలో భోజనం తినేందుకు గది లేకపోవడంతో వరండాలో తింటున్నారు. గ్లాసులు, ప్లేట్లు ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో ఇంటి నుంచే తెచ్చుకున్నారు.
- గూడూరు నియోజకవర్గం కోట మండలం కొత్తపాలెం బీసీ వసతి గృహం రేకుల గదిలో నిర్వహిస్తున్నారు. వర్షాలకు భవనం ఉరుస్తుండటంతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.
- నారాయణవనం ఎస్సీ వసతి గృహంలో ఉంటున్న 3,4 తరగతుల విద్యార్థులు సరైన సౌకర్యాలు లేక నేలపైనే నిద్రిస్తున్నారు.
- సత్యవేడు పాలిటెక్నిక్ కళాశాల బీసీ వసతి గృహంలో మరుగుదొడ్లు మరమ్మతులతో నిరుపయోగంగా ఉన్నాయి.
- సైదాపురం బీసీ వసతి గృహంలో లైట్‌లు లేకపోవడంతో చీకట్లో బిక్కు బిక్కు మంటున్నారు.
- వాకాడు బీసీ వసతి గృహంలో విద్యార్థులకు నాసిరకంగా భోజనం పెడుతున్నారు.
- చంద్రగిరిలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లకు తలుపులు లేవు. లైట్లు వెలగకపోవడంతో విద్యార్థులు చీకట్లోనే ఉంటున్నారు.



తిరుపతి : ఎస్సీ బాలికల-1 హాస్టల్‌లో ర్యాక్స్ లేక ఇలా..



తిరుపతి : చెన్నారెడ్డి కాలనీలోని ఎస్సీ బాలికల-1 హాస్టల్‌లో నేలపైనే నిద్ర



ఎస్వీయూలో స్వయం ఆన్‌లైన్ కోర్సు తప్పనిసరి కాదు

తిరుపతి సిటీ : ఎస్ఎఫ్ఐ నేతల తిరుగుబాటుతో ఎస్వీయూ వర్సిటీ అధికారులు దిగివచ్చారు. ఎట్టకేలకు స్వయం ఆన్‌లైన్ కోర్సులను తప్పనిసరి చేయాలనే నిబంధనను విరమించుకున్నారు. వర్సిటీలోని అన్ని విభాగాల్లో ఓపెన్ ఎలెక్టివ్ పేపర్లు అందుబాటులోకి వచ్చాయి. ఏ కోర్సు చేయాలనే నిర్ణయాన్ని విద్యార్థులకే వదిలేశారు. దీంతో స్వయం ఆన్‌లైన్ కోర్సులు విద్యార్థుల ఆసక్తిని బట్టి ఎంపిక చేసుకునే విధంగా ఐచ్ఛికం చేశారు. ఇది విద్యార్థుల సమిష్టి పోరాటమంతోనే విజయం సాధించామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కోకన్వీనర్ అశోక్ కుమార్, వర్సిటీ కార్యదర్శి వినోద్ కుమార్ పేర్కొన్నారు.

పరీక్షల విభాగంలో వీసీ తనిఖీ



పరీక్షల విభాగంలో తనిఖీ చేస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిపాలనా భవనంలోని పరీక్షల విభాగానికి వీసీ అప్పారావు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పరీక్షల షెడ్యూలు, త్వరలో జరగనున్న పరీక్షల ఫీజుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొందరు సిబ్బంది సమయపాలన పాటించడం లేదని గుర్తించారు. పరీక్షల సమాచార కేంద్రం పనితీరుపై ఆరా తీశారు. విశ్వవిద్యాలయంలో పరీక్షల విభాగం కీలకమైనదని, ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని, అవినీతికి చోటు లేకుండా నిబద్ధతతో పనిచేయాలని ఉద్యోగులకు సూచించారు.

నేటి నుంచి ఆర్టీసీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలు



మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి అర్బన్ : ఆర్టీసీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని డీఆర్వో నరసింహులు పేర్కొన్నారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 27 నుంచి ఆగస్టు1 వరకు పరీక్షలు ఉంటాయని వెల్లడించారు. జూపార్క్ వద్ద ఉన్న ఐకాన్ డిజిటల్ జోన్ సెంటర్‌లో పరీక్షలకు 3654 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుందని చెప్పారు. అలాగే కన్వెన్షల్ టైప్ పేపర్ పరీక్షలు ఉదయం 10 నుంచి 1గంట వరకు మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందని వివరించారు.కార్యక్రమంలో ఏపీపీఎస్సీ నుంచి సెక్షన్ ఆఫీసర్లు వెంకటరమణ, టీవీఎస్ శేఖర్‌తోపాటు పలువురు హాజరయ్యారు.



క్లుప్తంగా

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



మాట్లాడుతున్న చిత్తూరు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి

తిరుపతి కల్చరల్ : చిత్తూరు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్, శాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.రామకృష్ణయ్య తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు దేశవ్యాప్తంగా 400 మంది క్రీడాకారులు హాజరు కానున్నారని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సుధాకర్‌రావు, కోశాధికారి జి.శివయ్య, మునస్వామి పాల్గొన్నారు.

రేపటి నుంచి రెండవ విడత వెబ్ ఆప్షన్లు

తిరుపతి సిటీ : ఇంజినీరింగ్ తొలి విడత తొలి విడతలో ఎస్వీయూ పరిధిలో 14,352 మంది విద్యార్థులు సీట్లు సాధించి తమకు కేటాయించిన కళాశాలలో ప్రవేశాలు పొందారు. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో భాగంగా రెండవ విడత సీట్ల కేటాయింపు కోసం వెబ్ ఆప్షన్ల ప్రక్రియ సోమవారం నుంచి కొనసాగనుంది. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రక్రియపై సందేహాలకు ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని ఏపీఈఏఎమ్‌సెట్–2025 కౌన్సెలింగ్ సెంటర్ నందు సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.



నిలవ నీడలేని ఇంటి ముందు తమ్ముళ్లతో శివ

అన్నయ్య ఆరాటం.. బతుకు పోరాటం

తల్లిదండ్రులు మృతి చెందడంతో నలుగురు పిల్లలు అనాథలయ్యారు. వీరిని చేరదీసేవారు ఎవ్వరూ లేకపోవడంతో అందరికన్నా పెద్దవాడు రక్త సంబంధం వదులుకోలేక తోడబుట్టిన వారి భారాన్ని మోసేందుకు ముందుకు వచ్చాడు. 15 ఏళ్ల వయస్సులో కూలీ పనులకు వెళుతూ ఇద్దరు కవల తమ్ముళ్లతో పాటుగా క్షయ వ్యాధితో బాధపడే చెల్లిని చూసుకుంటూ నిలవ నీడలేక పోయినా పరదాల మాటున జీవనం గడుపుతున్న ఓ గిరిజన కుటుంబం దీనగాథ ఇదీ.

- చిన్న వయస్సులోనే కుటుంబ భారం
- తమ్ముళ్లు, చెల్లెలను కాపాడుకుంటున్న సోదరుడు

చిల్లకూరు : సాధారణంగా గిరిజనులు చిన్నప్పటి నుంచి ఎవరికి వారుగా జీవనం చేసుకునేందుకు భిక్షాటనను చేపట్టి ఇచ్చిన దాంతో తిని ఎక్కడ పడితే అక్కడ ఉండడం చేస్తుంటారు. అయితే గూడూరు మండలం విందూరు గిరిజన కాలనీకి చెందిన నలుగురు చిన్నారులు నిలువ నీడలేక పోయిన కాలనీలోనే పట్టలతో ఇంటిని నిర్మించుకుని గాలికి, వానకు తడుస్తూ ఎండకు ఎండుతూ ఉంటున్నారు. వీరిలో అందరికన్నా పెద్దవాడు మూడో తరగతి వరకు చదువుకుంటున్న సమయంలో తండ్రి మృతి చెందడంతో మిగిలిన ముగ్గురి బాధ్యతను తీసుకుని చదువును వదిలి పనిబాట పట్టి వచ్చిన కూలీ డబ్బులతో ఇద్దరు తమ్ముళ్లతో పాటుగా చెల్లికి అండగా నిలుస్తున్నాడు. ఈ క్రమంలో చిన్నారి చెల్లికి క్షయ వ్యాధి సోకిందని తెలిసి అల్లాడిపోతూ కూలీ డబ్బుల్లోనే చెల్లికి మందులు తీసుకుని వచ్చి ఒకరికి ఒకరు అండగా నిలుస్తున్నారు. గూడూరు మండలం విందూరు గ్రామంలోని గిరిజన కాలనికి చెందిన ఈశ్వరయ్య, పంరటమ్మ అనే గిరిజన దంపతులు ఉన్నారు. వీరికి 15 ఏళ్ల క్రితం తొలుత శివ అనే బాలుడు జన్మించాడు. అటు తరువాత మూడేళ్లకు వసంత అనే అమ్మాయి పుట్టింది. అటు తరువాత కవల పిల్లలుగా రామ, లక్షణ్ అనే జన్మించారు. అప్పట్లో ఆమె రక్తహీనత ఉండడంతో కొంత కాలానికి మృతి చెందింది. అటు తరువాత బిడ్డలను తండ్రి ఈశ్వరయ్య చూసుకుంటూ పెద్ద వాడైన శివను బడికి పంపాడు. శివ మూడో తరగతిలో ఉన్నప్పుడు తండ్రి కూడా కాలం చేశాడు. దీంతో నలుగురు పిల్లలు అనాథలయ్యారు. చెల్లి, తమ్ముళ్ల ఆకలితో అలమటించి పోతుండడంతో బడికి దూరమై కొద్ది రోజులు ఇంటింటికి వెళ్లి భోజనం తెచ్చి పెట్టేవాడు. ఇలా కుదరదని శివ కూలీ పనులకు వెళ్తూ వచ్చిన డబ్బుతో తమ్ముళ్లు, చెల్లికి భోజనం పెట్టి చూసుకుంటున్నాడు. అయితే చెల్లికి క్షయ వ్యాధి అని తెలియడంతో ఆ వచ్చిన డబ్బులతోనే మందులు తీసుకుని వచ్చి వాడుతున్నప్పటికీ నయం కాక పోవడంతో చెల్లి పరిస్థితి చూసి అల్లాడిపోతున్నాడు. ఇద్దరి తమ్ముళ్లను మంచి చదువులు చదివించాలని ఉందని గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఇద్దరిని మూడో తరగతి చదివిస్తున్నాడు. దాతలు ముందుకు వచ్చి బయట చదివించేందుకు సిద్ధమైనప్పటికీ ఒకరిని విడిచి ఒకరు ఉండలేక పోతున్నామని అందువల్ల గ్రామంలోనే ఉంటామని వాందరూ ఒకే మాట చెబుతున్నారు. ఐటీడీఏ అధికారులు వారి దీన స్థితిని గమనించి ప్రభుత్వం నుంచి ఆ కుటుంబానికి అండగా నిలిచేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

జాయింట్ ఎల్‌పీఎం సబ్ డివిజన్‌కు అనుమతి

తిరుపతి రూరల్: జాయింట్ ఎల్‌పీఎం(ల్యాండ్ పార్సిల్ మ్యాప్) సబ్ డివిజన్ చేసేందుకు ప్రభుత్వం మళ్లీ అనుమతించిందని తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాయింటు హక్కుదారులుగా ఉన్న భూములపై తరచూ వివాదాలు చోటు చేసుకోవడంతో పాటు అన్నదాత సుఖీభవ తదితర సంక్షేమ పథకాలను రైతులు పొందలేక పోతున్నారన్న ఫిర్యాదులతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. గతంలో జూన్ 30కి ముగింపు తేదీగా ప్రకటించినప్పటికీ మరొక అవకాశం కల్పిస్తూ డిసెంబరు 31వ తేదీ వరకు పొడిగించిందన్నారు. జాయింట్ ఎల్‌పీఎంల సబ్ డివిజన్ చేసుకునేందుకు రైతులు గ్రామ సచివాలయాల్లో రూ.50 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

'పంచగవ్య' శ్రేయస్కరం

తిరుపతి రూరల్ : పంచగవ్య ఉత్పత్తులతో మానవాళి మనుగడ శ్రేయస్కరమని ఐసీఎస్ఎస్ఆర్ నిపుణులు డాక్టర్ హర్షభార్గవి పేర్కొన్నారు. పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం ఉమెన్ ఐసీటీ ఫ్రాంటియర్ ఇనిషియేటివ్ డిజిటల్ ట్రాన్స్‌ఫార్మర్ , భారత్ ఏకం సస్టైనబుల్ డెవలప్‌మెంట్ సంస్థలతో కలసి ''సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ – సాంస్కృతిక మూలాల నుంచి ఆర్థిక మార్గాలవైపు'' అనే అంశంపై ఒక్కరోజు సదస్సును నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమం పంచగవ్య ఆధారిత వ్యవస్థాపకతపై ప్రధానంగా సాగింది. తక్కువ పెట్టుబడితో ఉత్పత్తులను ఎలా తయారు చేసుకోవచ్చనే విషయాలపై విద్యార్థులకు తెలియజేశారు. యూనివర్సిటీ అధ్యాపకులు విజయలక్ష్మి, పీఎం ఉషా ప్రాజెక్టు సభ్యులు పాల్గొన్నారు.

ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్‌పై అవగాహన

తిరుపతి రూరల్ : శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం అధీనంలోని ఇంజినీరింగ్ విద్యార్థులకు 'ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్' పై అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్‌కు చెందిన సీనియర్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ నిపుణులు డాక్టర్ శ్రీధర్‌నాయుడు అవగాహన కల్పించారు. శనివారం యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం అసోసియేషన్ వారు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. శ్రీధర్ నాయుడు 'ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్' పై సూచనలు, సలహాలు అందించారు. అలాగే ఇంజినీరింగ్ విద్యార్థి అసోసియేషన్ల ప్రాముఖ్యం గురించి వివరించారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ రంగంలో ఉన్న ఉద్యోగ అవకాశాల గురించి వివరించి, విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం అనుసరించాల్సిన మార్గాలను విశదీకరించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ పి.మల్లికార్జున, కోఆర్డినేటర్, అసోసియేషన్ అధ్యక్షురాలు డా. డి. హిమబిందు ఉపాధ్యక్షురాలు డా.ఎస్. శృతి, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డి.నర్మిత, కార్యదర్శి సిహెచ్.సిరి చందనా, సహాయ కార్యదర్శులు సివి. స్వేత, బి.వి.వి. సంగణశ్రీలు పాల్గొన్నారు.

గాజులమండ్యంలో భూవివాదం



అధికారులకు తమ గోడును తెలుపుతున్న బాధితులు

రేణిగుంట : మండలంలోని గాజుల మండ్యంలోని ప్రధాన రహదారికి ఆనుకొని గ్రామానికి చెందిన దొరై రాజుకు 1047 చదరపు అడుగుల స్థలం ఉంది. అందులో 927 చదరపు అడుగుల స్థలం తిరుపతి చెన్నై హైవే విస్తరణ కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకొని నష్ట పరిహారం చెల్లించింది. హైవే పనులు పూర్తయిన అనంతరం మిగిలిన స్థలంలో షాప్ పెట్టుకోవాలని ఆ కుటుంబం ఎదురుచూస్తోంది. ఇంతలో వీరికి వెనుక నివాసం ఉన్న టీడీపీ నేత కన్ను ఆ స్థలంపై పడింది. ఆ స్థలాన్ని ఆక్రమిస్తే తన ఇల్లు రోడ్డుకు వస్తుందన్న దురాశతో రెండు నెలలుగా ఆ కుటుంబాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల ద్వారా అధికారులపై ఒత్తిడి తెచ్చి భూమిని సొంతం చేసుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా శనివారం తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, రూరల్ సీఐ మంజునాథరెడ్డి సిబ్బందితో సంఘటన స్థలానికి జేసీబీతో బాధితుడి స్థలంలో ఉన్న గోడను కూల్చేందుకు ప్రయత్నించారు. బాధితుడి భార్య మునెమ్మ జేసీబీకి అడ్డుగా కూర్చోవడంతో గ్రామస్తులు అధికారుల చర్యలను తప్పుపట్టి బాధితురాలికి అండగా నిలిచారు. బాధితుడి కుమారుడు మునేంద్ర మాట్లాడుతూ.. స్థలానికి సంబంధించి తమ వద్ద పత్రాలు ఉన్నాయన్నారు. అధికార బలంతో ఆక్రమించాలని ప్రయత్నిస్తే ఊరుకోమన్నారు.

ప్రశ్నపత్రాలకు ఫీజు చెల్లించండి

తిరుపతి సిటీ : సమ్మేటివ్, ఫార్మేటివ్ పరీక్షల నిర్వహణ కోసం సీబీఏ విధానంలో 1 నుంచి 10వ తరగతి వరకు ఓఎంఆర్ షీటుతో పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలకు సైతం ప్రభుత్వం ప్రశ్నపత్రాలను అందించనుంది. ఇందులో భాగంగా ప్రతి ప్రైవేటు పాఠశాల అందుకు సంబంధించిన రుసుం చెల్లించాలని జిల్లా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రైవేటు పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రులను పీక్కుతింటోంది. 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు రూ.140, 6, 7వ తరగతి చదువుతున్న విద్యార్థులు రూ.160, 8 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు రూ. 190 తక్షణం చెల్లించాలని హుకుం జారీ చేసింది. దీంతో ఏడాదిగా లక్షలు వసూలు చేస్తూ తల్లిదండ్రులను అప్పులు పాలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలు కనీసం ప్రశ్నపత్రాలకు సంబంధించి ఫీజు చెల్లించకుండా తమపై రుద్దుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంతర్ జిల్లా ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం



ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న మైఖేల్ బెన్‌హర్, జిల్లా అధికారులు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని ఏఎల్‌సీఎం ఆటస్థలం ఆవరణలో శనివారం నుంచి రెండు రోజుల పాటు అంతర్ జిల్లాల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ముందుగా ఎస్‌ఏఎల్‌సీ మాజీ బిషప్ మైఖేల్ బెన్‌హర్‌తో పాటు ఫుట్‌బాల్ జిల్లా సంబంధిత అధికారులు ప్రారంభించారు. ఈ పోటీలలో తిరుపతి, నెల్లూరు,వైఎస్సార్ కడప తదితర జిల్లాలకు చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారిణులు పాల్గొంటున్నట్లు కోచ్ గౌస్‌బాషా తెలిపారు. ఈ పోటీలను నాయుడుపేట ఫుట్‌బాల్ క్లబ్ సారథ్యంలో జిల్లా అధికారులతో కలిసి పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు, క్లబ్‌కు చెందిన భావన్ అనుదీప్, సభ్యులు పాల్గొన్నారు.

నవోదయ ఫలితాల్లో 'విశ్వం' ప్రతిభ



నవోదయ ఫలితాలలో ప్రతిభ చూపిన విశ్వం విద్యార్థులు

తిరుపతి సిటీ : జాతీయ స్థాయిలో 2025–2026 విద్యా సంవత్సరానికి జరిగిన జవహర్ నవోదయ విద్యాలయ 3వ జాబితా ప్రవేశ పరీక్ష ఫలితాల్లో విశ్వం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. మొత్తం 69 మంది విశ్వం విద్యార్థులు సీట్లు సాధించారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ఆయన అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డి, కరస్పాండెంట్ ఎన్ తులసీ విశ్వనాథ్ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో జరిగే సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ వంటి పోటీ పరీక్షల్లో జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తోందన్నారు.2026 నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తుల కోసం 8688888802 / 9399976999 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

జనావాసాల్లోకి చిరుతలు రాకుండా చర్యలు

- జూపార్క్ ప్రాంతాల్లో చిరుతల కదలికలు
- రాత్రివేళల్లో ఒంటరిగా వెళ్లకూడదు
- వైల్డ్‌లైఫ్ సబ్ డీఎఫ్‌వో నాగభూషణం వెల్లడి



మాట్లాడుతున్న తిరుపతి వైల్డ్‌లైఫ్ సబ్ డీఎఫ్‌వో నాగభూషణం

తిరుపతి మంగళం : శేషాచల అటవీ ప్రాంతం నుంచి చిరుతలు జనావాసాల్లోకి రాకుండా చర్యలు చేపడుతున్నామని తిరుపతి వైల్డ్ లైఫ్ సబ్ డీఎఫ్‌వో నాగభూషణం తెలిపారు. తిరుపతి కపిలతీర్థం సమీపంలోని అటవీశాఖ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్వీ జూపార్క్ రోడ్డులో నిన్నటి రాత్రి చిరుత సంచారం కలకలం రేపిందన్నారు. ఆ మార్గంలో వెళుతున్న వాహనదారుడిపై చిరుత దాడి చేసేందుకు యత్నించిందని తెలిపారు. అయితే అటు మార్గంలో రాత్రి సమయంలో వెళ్లే వాహనదారులు నలుగురు, ఐదుగురు అలిపిరి సర్కిల్ వద్ద నుంచి కలిసి వెళ్లాలని సూచించారు. ఎస్వీ జూపార్క్ రోడ్డులో అధికంగా ఫుడ్‌స్టాల్స్ ఉన్నాయని, వారు అక్కడే పడవేసే ఫుడ్‌వేస్టేజ్ కోసం కుక్కలు, పందులు, జింకలు వస్తుంటాయని, వాటి కోసం చిరుతలు అక్కడి వస్తున్నాయని తెలిపారు. ఫుడ్‌స్టాల్స్ నిర్వాహకులు వేస్టేజ్‌ను అక్కడ పడవేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆ రోడ్డు మార్గంలో ఫుడ్‌స్టాల్స్‌కు ఎలాంటి అనుమతి లేదని, వాటిని తొలగించేందుకు టీటీడీ అటవీ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దాంతో పాటు ఎస్వీ యూనివర్సిటీ కళాశాల వద్ద గుట్టలుగా పడవేసే ఫుడ్ వ్యర్థాల కోసం ఇటీవల చిరుతలు ఆ ప్రాంతంలో సంచరించాయన్నారు. దాంతో అక్కడ బోను ఏర్పాటు చేసి చిరుతను పట్టుకోవడం జరిగిందన్నారు. అయితే ప్రస్తుతం ఎస్వీ యూనివర్శిటీ, జూపార్క్ రోడ్డు ప్రాంతాల్లో మూడు చిరుతలు సంచరిస్తున్నట్లు సీసీ ఫుటేజీల ద్వారా తెలిసిందన్నారు. మూడు చిరుతలతో పాటు వాటి పిల్లలు కూడ ఉన్నట్లు గుర్తించామన్నారు. అలిపిరి సర్కిల్ వద్ద నుంచి రాత్రి వేళల్లో టీటీడీ, అటవీ శాఖ సిబ్బందిని ఏర్పాటు చేసి జూపార్క్ రోడ్డులో వాహనదారులను గుంపులుగా పంపేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే చిరుత కదలికలను తెలుసుకునేందుకు ఆ ప్రాంతంలో 14 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ఎస్వీ యూనివర్సిటీ, జూపార్క్ రోడ్డులో రెండు బోన్లును కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చిరుతలు జనవాసాల్లోకి రాకుండా తగు చర్యలు చేపడుతున్నామన్నారు.

బోన్లు ఏర్పాటు

శేషాచల అడవుల్లో నుంచి జనవాసాల్లోకి వస్తున్న చిరుతలను పట్టుకునేందుకు బోన్లు ఏర్పాటు చేయడం జరిగిందని తిరుపతి అటవీశాఖ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఎస్వీయూనివర్శిటీ ప్రాంతంలో రెండు బోన్లు, ఎస్వీ జూపార్క్ రోడ్డులోని అరవింద కంటి ఆసుపత్రి సమీపంలో ఒక బోను ఏర్పాటు చేశామని తెలిపారు.



చిరుతలను పట్టుకునేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్న బోన్లు